సాక్షి రంగారెడ్డి

బుధవారం । 27 । ఆగస్టు । 2025



'భూదాన్'పై విచారణ

తాడిపర్తి భూదాన్ భూమి మరోసారి చర్చనీయాంశంగా మారింది. సమగ్ర విచారణకు సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. 10లో▸



ఆమనగల్లు: ఆకట్టుకుంటున్న గణనాథుడు

బొజ్జ గణపయ్య పూజకు వేళాయె..



ఇబ్రహీంపట్నం: గణనాథుడికి ఘన స్వాగతం



చేవెళ్ల: ముస్తాబైన మండపం



ఆమనగల్లు: పూలు, పత్రి కొనుగోలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మార్కెట్లలో వివిధ రూపాల్లో కొలువైన గణనాథుల విగ్రహాలను మండపాలకు తరలించారు. పండుగ నేపథ్యంలో మంగళవారం ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. భగవంతుడి పూజకు కావాల్సిన పూలు, పండ్లు, పత్రులు, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు



సిబ్బందికి సూచనలు చేస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

యాచారం: ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. నక్కర్తమేడిపల్లిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. నేరాల నివారణ, మహిళల భద్రత, సైబర్ నేరాల అప్రమత్తత, ప్రజలతో ఏ విధంగా వ్యవహరించాలో సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ శుభ్రత, ఫిర్యాదుల నమోదు, పెండింగ్ కేసుల వేగవంతం, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై వివరించారు. ఆమె వెంట ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం: వినాయకుల నిమజ్జనం ఏర్పాట్లను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆమె శేరిగూడ చెక్ డ్యాం, పరిసరాలను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చివెళ్లే మార్గాలపై ఆరా తీశారు. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



చేగూరు పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

నందిగామ: నానో యూరియా ఒక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ద్రవ రూప ఎరువు అని, దీంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందొచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి ఉష అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. సాంప్రదాయ గుళికల రూపంలో ఉన్న యూరియాతో పోలిస్తే నానో యూరియా ధర తక్కువగా ఉండటమే కాకుండా పనితీరు బాగుంటుందని చెప్పారు. సాంప్రదాయ యూరియా వెదజల్లిన సమయంలో నీటిలో కరిగి, గాలిలో ఆవిరి రూపంలో వృథా అవుతుందని, మొక్కలకు 30-40 శాతం ఎరువు మాత్రమే అందుతుందని అన్నారు. నానో యూరియా నేరుగా పత్ర రంధ్రాల ద్వారా మొక్కల్లోకి వెళ్లి 90 శాతం వరకు సమర్థవంతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకుని వాడుకోవాలని సూచించారు. అనంతరం చేగూరు, నందిగామ పీఏసీఎస్‌లలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, ఏఓ శివరామరావు, ఏఈఓ శిరీష, రవి తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ హుండీ ఆదాయం రూ.22.48 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత శివరామాలయాలకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని, మంగళవారం జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 90 రోజులకు సంబంధి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.22,48,653 సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంక్‌లో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, నిర్వాహకులు, ఆలయ అర్చక సిబ్బంది, అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రికిరాత్రే బదిలీ!

పీఏసీఎస్ ఉద్యోగులకు స్థాన చలనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 మంది..
- ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీబీ ఉన్నతాధికారులు
- ఇన్‌చార్జి పాలనలో ఎలా చేస్తారని కార్యదర్శుల గుర్రు
- బాధ్యతలు చేపట్టకపోతే స్టాఫ్ అసిస్టెంట్లకు అప్పగించాల్సి వస్తుందని అధికారుల హెచ్చరిక



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

యాచారం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులను రాత్రికిరాత్రే బదిలీ చేశారు. ఈ నెల 22న బదిలీలకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ డీసీసీబీ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఒకేచోట మూడేళ్ల పైబడి విధులు నిర్వర్తిస్తున్న వారిని బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బదిలీ స్థానానికి ఆప్షన్లు పెట్టుకోవడంపై రెండు రోజుల గడువు మాత్రమే ఇచ్చింది. ఆరు నెలల క్రితమే పీఏసీఎస్ కార్యవర్గాల పదవీ కాలం ముగియడం, తాజాగా రెండో మారుసారి ఆరు నెలల పదవీ కాలం పొడిగించడం జరిగింది. ఈ నేపథ్యంలో కార్యదర్శులు తమ బదిలీ ఉత్తర్వులపై అభ్యంతరం తెలుపుతున్నారు. ఇన్‌చార్జి పాలనలో ఏ విధంగా బదిలీ చేపడతారని, హైకోర్టును ఆశ్రయించి ప్రక్రియను నిలిపేసేలా చూసుకుంటామని మొండికేశారు. ఈ క్రమంలో బదిలీఅయిన కార్యదర్శులు వెంటనే విధుల్లో చేరని పక్షంలో స్టాఫ్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించే విధంగా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో యూరియా కొరత, రైతులు ఆందోళనల నేపథ్యంలో బాధ్యతలు చేపట్టే విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఏళ్లుగా పాతుకుపోయి..

సర్కార్ ఆదేశాల మేరకు పీఏసీఎస్ కార్యదర్శుల బదిలీ ప్రక్రియను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ అధికారులు పూర్తి చేశారు. నగరంలోని డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) కార్యాలయంలో సోమవారం సాయంత్రం కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి, వెంటనే ఆప్షన్లు స్వీకరించి రాత్రి పది గంటలలోపే ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 పీఏసీఎస్‌లకు గాను 56 మంది కార్యదర్శులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒకే పీఏసీఎస్‌లో మూడేళ్లకు మించి విధుల్లో ఉండరాదు. కాని ఎంతో మంది 20 ఏళ్లకు పైబడి కొనసాగుతున్నారు. కొన్ని పీఏసీఎస్‌ల్లో సరైన విధంగా నివేదిక పంపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అర్హులైన వేలాది మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోయారు. మరి కొన్ని పీఏసీఎస్‌ల్లో చైర్మన్లే బినామీల పేర్ల మీద రుణాలు తీసుకోవడం, డైరెక్టర్లకు రూ.లక్షలాది రుణాలిచ్చి మళ్లీ చెల్లించకపోవడంతో ఆయా పీఏసీఎస్‌లు దివాలా తీశాయి. రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో ఏళ్లుగా పాతుకుపోయిన కార్యదర్శులను తక్షణమే బదిలీ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహకార శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈమేరకు డీసీసీబీ ఉన్నతాధికారులు కార్యదర్శుల బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మందికి మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది. కాగా, సోమవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు పొందిన కార్యదర్శులు మంగళవారం ఎక్కడా బాధ్యతలు చేపట్టకపోవడం విశేషం.

'మీసేవ'ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: జిల్లాలోని ఐదు మండలాల్లో 11 మీసేవా కేంద్రాల ఏర్పాటుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 30 వరకు ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గండిపేట మండలంలోని వట్టినాగులపల్లి, గండిపేట, కిస్మత్‌పూర్, గంధంగూడ, మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, కనకమామిడి, జిల్లెడ్ చౌదరిగూడ మండలం తుంపల్లి, ఎదిర, సరూర్‌నగర్ మండలంలోని తుమ్మబౌలి, మంచాల మండలంలోని లోయపల్లిలో కొత్తగా మీసేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 21 నుంచి 44 సంవత్సరాల మధ్య వయసు కలిగి, డిగ్రీ ఆపై విద్యార్హతలు ఉండి, కంప్యూటర్ గురించి పూర్తి పరిజ్ఞానం, అవగాహన సర్టిఫికెట్ ఉన్న స్థానిక మండలానికి చెందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని.. ఎంపికలో పేద, దివ్యాంగ యువత, ఇతర వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కేంద్రాల నిర్వహణకు అవసరమైన పెట్టుబడి స్థోమత ఉండాలన్నారు. కలెక్టర్ పేరు మీద రూ.500 డీడీ తీసి ధ్రువ పత్రాలతో కలిపి దరఖాస్తుకు జతచేసి ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి నేర చరిత్ర నిర్ధారణ అయితే అనర్హులుగా పరిగణిస్తామన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

కలెక్టర్ నారాయణరెడ్డి



మట్టి గణపతులను అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలను వినియోగించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ని నిర్మూలించే దిశగా మట్టితో చేసిన గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఏఈ వెంకట నర్సయ్య, ఏఈఎస్ ఆర్.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీల్లో పని చేస్తున్న టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాజుతోపాటు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. వేతనాలు పెంచడంతో పాటు ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ల్యాప్‌ట్యాప్‌లు అందజేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం షాద్‌నగర్ ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జయమ్మ, ఉపాధ్యక్షులుగా అరుణ, జయమ్మ, కార్యదర్శిగా ఊర్మిళ, కోశాధికారిగా శ్రీదేవి, సహాయ కార్యదర్శులుగా సంతోష, జయమ్మతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బీససాయిబాబ, శ్రీనివాస్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పరిహారం చెక్కులు అందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

పరిహారం చెక్కుల పంపిణీ

రేడియల్ రోడ్డు నిర్మాణానికి ముందడుగు

కందుకూరు: ఫ్యూచర్‌సిటీలో భాగంగా ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట 200 అడుగుల ఫార్మా రహదారి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో నిర్మించతలపెట్టిన రేడియల్ రోడ్డు నిర్మాణానికి ముందడుగు పడింది. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న కొందరు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రాగా వారికి అధికారులు పరిహారం చెక్కులు అందించారు. గతంలో ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి కొంగర, లేమూరు, రాచులూరు, తిమ్మాపూర్ తదితర గ్రామాల మీదుగా రేడియల్ రహదారి నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నోటిఫికేషన్ జారీ చేశారు. సర్వే పనుల అనంతరం పలుమార్లు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 38.38 ఎకరాల్లోని 49 మంది రైతులకు మంగళవారం కందుకూరు ఎంపీడీఓ సమావేశ హాల్‌లో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి చేతుల మీదుగా పరిహారం చెక్కులు అందజేశారు. రాచులూరులో 34 ఎకరాలకు గాను 43 మంది రైతులకు ఎకరాకు రూ.96,16,813 చొప్పున, తిమ్మాపూర్‌లో 4.34 ఎకరాలకు గాను ఆరుగురు రైతులకు ఎకరాకు రూ.82,43,052 చొప్పున అందించారు. అదనంగా ప్రభుత్వం అభివృద్ధి చేయనున్న లేఅవుట్‌లో ఎకరాకు 121 గజాల స్థలం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్యూచర్‌సిటీ రేడియల్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మెరుగైన పరిహారం ఇవ్వడం సంతోషించదగ్గ పరిణామమన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సంప్రదింపులు జరిపిన తర్వాత భూసేకరణ చట్టం కంటే అదనంగా పరిహారం రైతులకు అందుతోందన్నారు. అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- మృతి చెందిన తండ్రీకూతురు బంధువులు, గ్రామస్తుల ఆందోళన
- హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ధర్నా
- మూడు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్
- స్పీకర్ ప్రసాద్‌కుమార్ హామీతో విరమణ



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో సిమెంట్ ట్యాంకర్ కింద పడి తండ్రీ కూతురు మృతిచెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి అంగీకరించకుండా అంతా కలిసి న్యాయం చేయాలంటూ హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ధర్నాకు దిగారు. వారికి కోట్‌పల్లి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు పలికారు. రోడ్డు ప్రమాదంలో రవీందర్, ఆయన 13 ఏళ్ల కూతురు కృప మృతితో భార్య రత్నమ్మ, ఆరేళ్ల కొడుకు మాత్రమే మిగిలారని, వారికి ఎలాంటి ఆధారం లేదన్నారు. రత్నమ్మ కాంట్రాక్టుపై ఏఎన్‌ఎంగా పనిచేస్తోందని ఆమె ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని రావాలని పట్టుబట్టారు. ఆందోళనతో మూడు గంటలపాటు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ ఆందోళనకారులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన తగిన విధంగా సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. అనంతరం ఆస్పత్రి వద్ద ఉన్న మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

చిరువ్యాపారుల దుకాణాలు తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

చేవెళ్ల: మున్సిపల్ కేంద్రంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే అధికారులు ట్రాఫిక్, సివిల్ పోలీసుల సహకారంతో జేసీబీ, డోజర్లతో వచ్చి తొలగింపు చర్యలు చేపట్టారు. బస్‌స్టేషన్, పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల తొలగించారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు అక్కడికి చేరుకున్నారు. చిరువ్యాపారాలే తమకు జీవనాధారమని, దుకాణాలను తొలగిస్తే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న పెద్ద వ్యాపార సముదాయాలను వదిలి తమనే టార్గెట్ చేయడం సరైంది కాదన్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతవారణం నెలకొంది. నిబంధనల ప్రకారమే అక్రమంగా వెలసిన దుకాణాలను తొలగిస్తున్నామని, వ్యాపారులకు సైతం సమాచారం అందించామని అధికారులు తెలిపారు. రైతుబజారు స్థలంలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ పాలకవర్గం సభ్యులు రైతు బజారులోని స్థలాన్ని చదును చేసి దుకాణాల ఏర్పాటుకు సహకరించారు. సోమవారం సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందిన సంగతి తెలిసిందే. నిత్యం ట్రాఫిక్‌జామ్, ప్రమాదాలకు రోడ్డుపక్కన ఉండే దుకాణాలే కారణమని భావించిన అధికారులు వాటిని తొలగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



లేబర్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

ఏఎల్‌ఓ ఎదుట ధర్నా, వినతిపత్రం అందజేత

ఇబ్రహీంపట్నం: భవన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వప్న డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి, సంబంధిత అధికారి ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్డుల్లో పేర్లు తప్పులు దొర్లితే ఏఎల్‌ఓ సరి చేయాలన్నారు. కొత్త కార్డులు తీసుకోవాలన్నా, రెన్యూవల్స్ చేసుకోవాలన్నా కార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కాలయాపన చేయకుండా ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి కార్మికుల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహ, యాదగిరి, వీరేశం, జంగయ్య, రాజు, నర్సింగ్, భాస్కర్, శ్రీనివాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల అరెస్ట్ అప్రజాస్వామికం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కిషన్

తుర్కయంజాల్: సీలింగ్ భూముల రైతులకు పట్టాలను పంపిణీ చేయాలని అనాజ్‌పూర్ పరిశీలనకు వెళ్తున్న సీపీఎం నేతల అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లో అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నియంతలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 1991లో అప్పటి ప్రభుత్వం 125 మంది రైతులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున సీలింగ్ పట్టాలను ఇచ్చిందని, కొందరికి పాసు పుస్తకాలు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ధరణి, భూభారతి వచ్చిన తరువాత పాసు బుక్‌లు ఇవ్వకుండా, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో చేర్చకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. దీన్ని ఖండిస్తూ ర్యాలీగా వెళ్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేయడం సరైనది కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బడుగుల శంకరయ్య, మాధవరెడ్డి, కృష్ణ, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ పాఠశాల హెచ్ఎంగా వెంకటయ్య

దౌల్తాబాద్: దౌల్తాబాద్ సీపీఎస్ హెచ్ఎంగా వెంకటయ్య నియమితులయ్యారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా చిట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వెంకటయ్య పదోన్నతి పొంది దౌల్తాబాద్ బాలికల ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎంగా వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి పనిచేస్తున్న సాయిలు, పదోన్నతి పొందిన హెచ్ఎం వెంకటయ్యను స్థానిక ఉపాధ్యాయులు సన్మానించారు.

లారీ ఢీకొని క్లీనర్ మృతి

ఖమ్మంక్రైం: లారీ నుంచి కిందకు దిగిన క్లీనర్ సైడ్ చెబుతున్న క్రమాన అదే లారీ ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం శ్రీశైలం (50) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. తుర్కపల్లి నుంచి యూరియా లోడ్ తీసుకుని, డ్రైవర్‌తో పాటు మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఈక్రమంలోరాపర్తినగర్ బైపాస్ వద్ద శ్రీశైలం కిందకు దిగి సైడ్ చూపుతుండగా డ్రైవర్ ఇస్తారి అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై శ్రీశైలం భార్య అనురాధ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



చిన్నలింగయ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలోని ఆశా కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వారుగంటి చిన్న లింగయ్య(35) కొన్నేళ్ల క్రితం పట్టణానికి వలస వచ్చారు. ఆయన ప్రైవేట్ జాబ్ చేస్తుండగా.. భార్య మేఘన మెస్‌లో పని చేస్తూ పిల్లలతో కలిసి ఉంటున్నారు. చిన్నలింగయ్యకు కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోవాలని, ఏదైనా పని చేసుకోవాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. సోమవారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో భార్య మేఘన పిల్లలతో కలిసి బయలుదేరింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చిన్నలింగయ్య అదేరోజు రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ బిచ్చయ్య తెలిపారు.

‘భూదాన్’పై విచారణ

- తాడిపర్తిలో ఫార్మా పరిహారం అందజేతపై సీఎం ఆగ్రహం
- సీఎంఓ కార్యాలయం నుంచి ప్రత్యేకాధికారి నియామకం
- ఇప్పటికే టీజీఐఐసీ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- న్యాయం కోసం రైతుల వేడుకోలు



తాడిపర్తి భూదాన్ భూమిలో పాతిన టీజీఐఐసీ బోర్డు

యాచారం: తాడిపర్తి భూదాన్ భూమి(ఎడ్లకంచె) మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ఈ భూమికి ఫార్మా పరిహారం అందజేతపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. భూదాన్ భూమికి ఫార్మా పరిహారం అందజేతపై మంగళవారం సీఎంఓ ఉన్నతాధికారులు ఇబ్రహీంపట్నం భూసేకరణ అధికారులకు ఫోన్లు చేసి ప్రాథమిక సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. ఆచార్య వినోభాబావే నేతృత్వంలో 1954లో జరిగిన భూదానోద్యమంలో భాగంగా మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబ సభ్యులు తమ పేరిట ఉన్న సర్వేనంబరు 104లో ఉన్న 250 ఎకరాలను సర్వోదయ భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేశారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు ఈ భూమిని రికార్డుల్లో నమోదు చేయలేదు. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం చేసింది. ఆ తర్వాత గ్రామస్తులు ఈ భూముల్లో ఎర్రజెండాలు పాతి పశువులు, గొర్రెలు, మేకలను మేపుతూ, కొంత భూమిని సాగు చేసుకున్నారు.

దొడ్డిదారిన హక్కు పత్రాలు

సర్వేనంబరు 104లోని 250 ఎకరాలను గ్రామస్తులు భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేసిన రెవెన్యూ అధికారులు రికార్డుల్లో మార్చకపోవడంతో అక్రమార్కుల కన్ను పడింది. రికార్డుల్లో భూదాన యజ్ఞ బోర్డుకు దానం చేసిన రైతుల పేర్లే వస్తుండడంతో రెవెన్యూ అధికారులు అండదండలతో కొందరు సదరు భూమిని కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించారు. 2010 తర్వాత ఈ భూమిని చదును చేసి అక్రమంగా వెంచర్ కూడా చేశారు. పట్టా రైతుల పేర్ల స్థానంలో దొడ్డిదారిన చేరిన భూకబ్జాదారుల పేర్లే రికార్డుల్లో నమోదు అవుతున్నాయి. వాటి ఆధారంగా అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలోనే రాజకీయ పలుకుబడి కలిగిన నేతలు ఈ భూమిని కొనుగోలు చేసి, రికార్డులను తమ పేర్లపై మార్చుకున్నారు. ఆ తర్వాత రియల్ ప్రభావంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి.

ఫార్మాతో రూ.27 కోట్ల పరిహారం

గత బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మాసిటీకి సేకరించాల్సిన 19,333 ఎకరాల్లో సింహభాగం మండలంలోని తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల నుంచే ఉంది. అధికారులు తాడిపర్తి సర్వేనంబరు 104లోని 250 ఎకరాల భూమి సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇదే అదునుగా భావించి భూదాన్ భూమిలో పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన రైతులు ఫార్మాకు ఇవ్వడానికి అధికారులకు అంగీకార పత్రాలు ఇచ్చారు. సదరు భూమి భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందినదని స్థానిక రైతులు ఆందోళనకు దిగి, ఫార్మాసిటీకి సేకరించవద్దని హైకోర్టును సైతం ఆశ్రయించారు. దీంతో అక్రమార్కులు పరిహారం కోసం ఉన్నత స్థాయిలో పైరవీలకు జీవం పోశారు. 2020–23 మధ్యలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓగా పనిచేసిన ఓ అధికారి అండతో పరిహారం పొందడానికి లైన్ క్లియర్ చేసుకున్నారు. మొత్తం 250 ఎకరాల్లో 53 ఎకరాలు అటవీ ప్రాంతం ఉందని, 24 ఎకరాల్లో బంధం చెరువు, 5 ఎకరాల భూమిలో పలు దేవతామూర్తుల ఆలయాలకు వదిలి, మిగతా 168 ఎకరాల భూమికిగాను 85 మంది రైతులకు ఎకరాకు రూ.16 లక్షల చొప్పున రూ.27 కోట్లకు పైగా పరిహారాన్ని అందజేశా రు. గ్రామస్తుల ఆందోళనలతో పరిహారం పొందిన రైతులకు ఫార్మా ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపేశారు.

> **ఫార్మా ప్లాట్లు నిలిపేశాం**
>
> 
>
> తాడిపర్తిలోని సర్వేనంబరు 104లో ఫార్మా పరిహారం పొందిన రైతులకు మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపేశాం. తాజాగా ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. సీఎంఓ లేదా సీసీఎల్‌ఏ కార్యాలయాల నుంచి ఉన్నతాధికారులతో విచారణ చేయొచ్చు. నాకైతే సమాచారం లేదు.
>
> – అనంతరెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో గ్రౌండింగ్ పూర్తి చేసి బేస్మెంట్ స్థాయి వరకు వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందజేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, వనమహోత్సవం, గణేశ్ నవరాత్రి ఉత్సవాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించాలని చెప్పారు. మున్సిపాలిటీలల్లో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌ను అధిక సంఖ్యలో చేపట్టాలని కమిషనర్లకు సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నయన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన నిమజ్జనం చేయనున్నందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండగ జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు బాగు చేయండి



కాగజ్‌ఘట్‌లో రోడ్డు బాగు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మంచాల: వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన మంచాల–ఆగాపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాగజ్‌ఘట్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కావడం లేదన్నారు. ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘట్, జాపాల మీదుగా మంచాల మండల కేంద్రానికి చేరుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. రహదారిపై గోతులు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, యాదగిరి, నగేష్, యాదయ్య, భిక్షపతి, దానయ్య, భరత్, కృష్ణ, రంజిత్, మణి తదితరులు పాల్గొన్నారు.

పీవీ నర్సింంహారావు ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా



ఎక్స్‌ప్రెస్ వేపై పల్టీ కొట్టిన కారు



స్వల్ప గాయాలతో బయటపడిన ఖలీల్

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి పీవీ నర్సింంహారావు ఎక్స్‌ప్రెస్ వేపై పల్టీ కొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టి స్ట్రీట్ లైట్ స్తంభాన్ని నెలకూల్చి అవతలి రోడ్డుపై పడింది. అయితే అదృష్టవశాత్తు కారులోని ఎయిర్ బ్యాగ్‌లో ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళితే..గుడిమల్కాపూర్ మహేంద్ర షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్న మహ్మద్ ఖలీల్ మంగళవారం సాయంత్రం షోరూమ్‌కు చెందిన కారును ట్రయల్ కోసమని పీవీ నర్సింంహారావు ఎక్స్‌ప్రెస్ వే మీదుగా ఆరాంఘర్ వరకు వెళ్లి తిరిగి మెహిదీపట్నం వైపు పయనమయ్యాడు. పిల్లర్ నంబర్ 212 వద్దకు రాగానే అతి వేగం కారణంగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. రోడ్డు మధ్యలో స్ట్రీట్ లైట్ స్తంభాన్ని కూల్చి పల్టీ కొడుతూ పక్క రోడ్డుపైకి వచ్చి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ఎయిర్‌బ్యాగ్ ఓపెన్ కావడంతో ఖలీల్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనతో ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

కడ్తాల్: యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 570 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. గతేడాది కడ్తాల్, రావిచేడ్ గ్రామాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలతో పాటు, కడ్తాల్, ముద్విన్ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు

గోల్కొండ: బస్టాప్‌లో నిల్చున్న సిటీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన మెహిదీపట్నం బస్టాండ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మెహిదీపటన్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లింగంపల్లి నుంచి మంగళవారం ఉదయం మెహిదీపట్నం బస్టాప్‌కు వచ్చింది. సమీపంలోకి రాగానే బస్సు అకస్మాత్తుగా ఆగిపోయింది. డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపి మళ్లీ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే బస్సు తిరిగి స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులందరూ దిగిపోయారు. దీంతో డ్రైవర్ బస్సు బానెట్ ఓపెన్ చేసి కేబుల్ సరి చేస్తుండగా ఒకేసారి మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సంఘటనా స్థలానికి చేరుకునేలోగా బస్సు ముందుబాగం దగ్ధమైంది. మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ కే.వీ.ఎస్.మూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అక్రమ మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులు 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ చంద్రగిరి కాలనీలోని శ్రీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిమిడి జగదీష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేయగా విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 12 మద్యం బాటిళ్లను సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

90 కిలోల బెల్లం స్వాధీనం

హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ బీ టీం ఎస్సై బాలరాజు బృందం దాడులు నిర్వహించింది. బైక్ పై తరలిస్తున్న 90 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాయచూరు తండాకు ఈ బెల్లాన్ని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

బాల కార్మికులకు విముక్తి

నందిగామ: కొంత కాలంగా బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్న పరిశ్రమపై పోలీసులు, లేబర్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరికి విముక్తి కల్పించినట్లు నందిగామ సబ్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మేకగూడ శివారులోని బ్లోటెక్ ప్యాకేజింగ్ పరిశ్రమలో కొన్ని నెలలుగా బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్నారనే విషయం తెలుసుకున్న పలువురు కార్మిక సంఘాల నేతలు మంగళవారం పరిశ్రమలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సమయంలో ఇద్దరు బాల కార్మికులు పనులు చేస్తూ కనపడటంతో విషయాన్ని పోలీసులకు, లేబర్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులను గుర్తించారు. ఈ మేరకు బాల కార్మికులకు విముక్తి కల్పించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఐటీ కారిడార్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఐటీ కారిడార్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్, గాజైల్ ప్రాంతానికి చెందిన పోసెంజిట్ లోహర్ (18) వారం రోజుల క్రితం పోచారం వచ్చాడు. ఇన్ఫోసిస్ సమీపంలోని ఏఎస్‌బీఎల్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన స్టోర్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. పక్కనే ఉన్న లేబర్ క్యాంప్‌లోని బీ–5 రూమ్‌లో ఒక్కడే ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు అన్నోజిగూడ వెళ్లి తిరిగి వచ్చాడు. ఫోన్ రిపేరీకి తల్లిదండ్రులను డబ్బులు అడిగితే పంపించలేదని, దీంతో కోపం వచ్చి ఫోన్ పగలగొట్టానని తోటి వర్కర్లతో చెప్పాడు. మంగళవారం ఉదయం పక్క గదిలో ఉన్న వారు అతడిని పనికి తీసుకెళ్లేందుకు వచ్చారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు తెరిచి చూడగా ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని అన్న మృతి

తమ్ముడికి గాయాలు...

బాలానగర్: లారీ ఢీకొని అన్న మృతి చెందగా తమ్ముడికి తీవ్ర గాయాలైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయగూడకు చెందిన అన్నదమ్ములు పార్సి రోహిత్(26), పార్సి నితిన్ మంగళవారం నిజాంపేటలో ఫంక్షన్‌కు హాజరై యాక్టివాపై తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన లారీ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో పార్సీ రోహిత్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తమ్ముడు పార్సీ నితిన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో ప్రేమాయణం.. నెలరోజులుగా సహజీవనం

యువకుడికి రిమాండ్

బంజారాహిల్స్: తాను హాస్టల్‌లో ఉంటున్నానని, నెల రోజులుగా తల్లిదండ్రులను నమ్మించిన ఓ బాలిక తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి గదిలో ఓ అబ్బాయితో ఉన్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలిక(16) ఏడాది క్రితం తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని తల్లిదండ్రులతో గొడవ పడి హైదరాబాద్‌కు వచ్చింది. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తోంది. హాస్టల్‌లో ఉంటున్నానని తల్లిదండ్రులకు చెప్పేది. అయితే ఈ నెల 25న తల్లిదండ్రులకు ఫోన్ చేసి గత నెల రోజులుగా తాను డెలివరీ బాయ్(19)గా పని చేస్తున్న యువకుడితో ఫిలింనగర్‌లోని ఓ గదిలో సహజీవనం చేస్తున్నానని, వారం రోజుల నుంచి సదరు యువకుడు తనను తీవ్రంగా కొడుతున్నాడని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు కుమార్తె చెప్పిన అడ్రస్‌ను వెతుక్కుంటూ నగరానికి వచ్చారు. బాలికను లోబర్చుకుని సహజీవనం చేస్తున్న యువకుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటీ అలవెన్స్ సమస్య పరిష్కారం

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి కార్మికుల ఓటీ అలవెన్స్ సమస్యకు గంటల వ్యవధిలోనే పరిష్కారం లభించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రూ. 5 కోట్ల ఓటీ బకాయిలు, పరిహారం విడుదలయ్యాయి. మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డితో మాజీ ఎంపీ, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు మధుయాష్కి గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల రాజి రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జలమండలి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కార్మికుల ఓటీ అలవెన్సులు తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి ఫైనాన్స్ విభాగం అధికారులతో మాట్లాడి, జులై వరకు పెండింగ్‌లో ఓటీ అలవెన్సులను విడుదల చేయాలని ఆదేశించారు అనంతరం ప్రతినిధుల బృందం జలమండలి ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ పద్మావతిని సంప్రదించగా తక్షణమే ఓటీ అలవెన్సులు విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

అలవెన్స్‌లలో జాప్యం వద్దు..

నిరంతరం సేవలందించే కార్మికులకు ఓటి అలవెన్సులు చెల్లించడంలో ఆలస్యం జరక్కుడదని మధుయాష్కి గౌడ్ అభిప్రాయపడ్డారు. ఇకపై ప్రతి నెల 10లోగా ఓటి అలవెన్స్ లిస్టు పంపిస్తే 15 లోగా కార్మికులకు అలవెన్స్‌లు అందుతాయన్నారు. త్వరలో యూనియన్ ఎన్నికలపైన తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఉద్యోగులు కార్మికుల సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

వినాయక చవితి కానుక

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి ఉద్యోగుల ఓటి బకాయిలు ,పరిహారం కింద రూ.5 కోట్లు బోర్డు విడుదల చేసి వినాయక చవితి పండగ కానుక అందించిందని ఐఎన్‌టీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల రాజి రెడ్డి అన్నారు. ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చొరవతోనే ఉద్యోగులకు బకాయిపడ్డ పరిహారాన్ని యాజమాన్యం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో జలమండలి ఐఎన్‌టీయూసీ జేఏసీ ప్రతినిధులు రాజి రెడ్డి, రాఘవేంద్ర రాజు, అల్లి శ్రవణ్ కుమార్, ఎండీ జాంగీర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, బి.జయ్ రాజ్, బి.మహేష్ బి. సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.